వంశీ ప్రచురణ



యద్దనపూడి సులోచనారాణి
స్మరణలో

65 మంది
తెలుగు రచయితల

# కొత్త కథలు



# అభివృద్ధి



**డా॥ సి. ఆనందారామం**

రోషన్ దుఃఖం ఆపుకోలేక పోతున్నాడు.

అతడి అన్నకి పెళ్ళి అయిపోయింది.

ఈ రెండు విషయాలకి 'రసాత్మక' సంబంధం ఏమీ లేదు.

అన్న పెళ్ళి చేసుకున్న అమ్మాయిని రోషన్ ప్రేమించడం లాంటి రసాత్మకమైన విషయాలేవీ లేవు. "రోషన్" అనే పేరు అతడు తన పదోక్లాసులో ఉండగా తనకు తానుగా పెట్టుకున్నది.

అతడి తండ్రి మల్లేష్, తాపీ పనిచేసేవాడు. సంపాదన ఫరవాలేదు. కానీ, సాయంత్రం కాగానే తిన్నగా కల్లుదుకాణంలో అయిదారు ముంతలు పుచ్చుకొని కానీ ఇల్లు చేరేవాడు కాదు. అంచేత తిండికి లోటు లేకపోయినా, నిలవ చెయ్యలేదు.

అతడి భార్య నాగమ్మ. అన్ని విధాలా అతడికి తగిన భార్య. నాలుగిళ్ళలో పాచిపనులు చేస్తుంటుంది. కానీ, భర్త అడుగుజాడల్లో నడుస్తూ, సాయంత్రాలే కాదు పగలు కూడా మధ్యే మధ్యే ఒక ముంత పుచ్చుకొంటూ ఉంటుంది. ఆమె కూడా ఏవీ నిలవలు చెయ్యలేదు.

ఈ దంపతులకు ముగ్గురు కొడుకులు. పెద్దవాడు డ్రైవర్ ఉద్యోగంతో రాజీపడి పెళ్ళికూడా చేసేసుకున్నాడు. రెండోవాడు ఏదో కంపెనీలో

అటెండర్‌గా చేరి పెళ్ళి చేసుకుంటున్నాడు.

మూడోవాడు రోషన్

"ఒకటో క్లాసులో ఒక్కేడు, రెండోక్లాసులో రెండేళ్ళు పద్ధతిలో పదోక్లాసు ఇరవై ఏళ్ళకు దాటాడు.

తల్లికి రోషన్‌ని పెద్ద ఆఫీసర్ చెయ్యాలని గొప్పకల. అందుకే... పెద్ద పెద్ద ఫీజులు కట్టి ప్రైవేట్ స్కూల్స్‌లో ఇంగ్లీషు చదువు చదివించింది. తర్వాత మళ్ళీ ప్రైవేట్ కాలేజీలోనే, హైక్లాసు చదివి, ఆరేళ్ళకి ఇంగ్లీష్ చదువు పూర్తి చేసాడు. ఈ కాలంలో అతడు చదువు కంటే ప్రేమ కథల్లో ఆరితేరాడు. ఎవరో హైక్లాసు అమ్మాయి తనను ప్రేమిస్తుందని, హైక్లాస్ కలలు చాలా కనేవాడు. కొన్నిసార్లు ప్రయోగాలు చెయ్యబోయి చెంపదెబ్బలు తిని అలాంటి ప్రయత్నాలు ఆపేశాడు.

"మా రోషన్ ఇరవై క్లాసులు" చదివి పెద్ద ఉద్యోగం చెయ్యాలి అప్పుడే పెళ్ళి అంటుంది నాగమ్మ.

కానీ డబ్బు అదెట్లా... సమస్య అక్కడే...

"గవర్నమెంట్ కాలేజీలో చేర్పించు జీతాలు తక్కువ" అని సలహా ఇచ్చారు నాగమ్మ స్నేహితులు.

"గవుర్నమెంటా? ఆడ సదువు చెప్పరంట గదా! ఆడ సదివినోళ్ళకి ఉద్యోగాలు రావంట. ఇంక చదివి దేనికి?" అంది నాగమ్మ.

ఎట్టకేలకు రోషన్‌కి ఒక ప్రైవేట్ కాలేజీలో బి.కాం. కంప్యూటర్స్‌లో సీటు దొరికింది.

ఇంట్లో పండుగ చేసుకున్నారు.

రోషన్ "అప్పుచేసి" స్నేహితులకు పార్టీ ఇచ్చాడు.

అంతలో...కుంగిపోయాడు.

ఫీజు 'పాతికవేలు' ఎలా కట్టాలి.?

అందరూ, పెద్దన్నని అడిగారు.

"నాకు బోలెడు ఖర్చులు. నా పెళ్ళాం కడుపుతో ఉంది. పోయి గవర్నమెంటు కాలేజీలో చేరమను..." అన్నాడు.

# కలెక్టరు కొడుకు



## పోల్కంపల్లి శాంతాదేవి

"ఒరే, కేశవులూ ! నీకు శుభవార్తరా ! ఊరు ఊరంతటికీ శుభవార్త!" ప్రక్కింటి గోపాలం హడావిడిగా వచ్చాడు. అతడి చేతిలో ఆనాటి న్యూస్ పేపరుంది.

ఇంటి వెనుక దొడ్లో జీతగాడికి ఏదో పని పురమాయిస్తూ, నెల రోజుల క్రింద పుట్టిన ఆవుదూడకు మూతి దగ్గర పచ్చిగడ్డి పరకలు పెట్టి తినడం నేర్పుతున్నాడు కేశవులు. మరోచేత ఆప్యాయంగా దానిగొంతు కింద నిమురుతున్నాడు. "ముఖ్యమంత్రి రైతుల కేమన్నా వరాల జల్లులు కురిపించిండా?" అనడిగాడు ఆశ్చర్యంగా, కొంచెం ఆశగా.

"ఏహే! అంతకంటే సంతోషకరమైన వార్త ! మన సుభాష్ అయ్యేఎస్‌కి సెలక్టయ్యాడంట. ! అతడి ఫోటో, అతడికొచ్చిన రాంక్ కూడా వేశారు. ఇంటర్వ్యూ కూడా వేశారు. "మొదటి ప్రయత్నంలోనే మన రాష్ట్రానికి రెండో రాంకు కొట్టాడయ్యా మన సుభాష్ ! ఇది మీకే కాదు, ఊరంతటికీ గర్వకారణం. సుభాష్ ఫోటో కనిపించేటట్టు మడతపెట్టిన పేపరు కేశవులుకిచ్చాడు గోపాలం.

పేపరులో కొడుకు ఫోటో చూసుకుంటుంటే కేశవుల ఛాతీ పొంగినట్టయింది. "ఏడుకొండలవాడా ! నీకు జోడు కొబ్బరికాయలు కొడతా" అతడి కళ్ళ నుండి జలజలా ఆనంద బాష్పాలు రాలిపోసాగాయి.

"మిఠాయి ఎప్పుడు తినిపిస్తావు కేశవా?"

"తినిపిస్తా, తినిపిస్తా ! ఇదిగో, ఈవార్త నీ చెల్లెలికి వినిపించి రానీ! సంతోషపడుతుంది" పేపరు పట్టుకుని ఇంట్లోకి పరుగుదీశాడు. "మన సుబ్బు ఐ.ఎ.ఎస్.కి సెలెక్ట్ అయ్యాడటనే!"

"గోపాలం అన్నయ్య ముందు ఆ వార్త నాకే చెప్పాడు. తరువాతే నీదగ్గరికి వచ్చాడు!" ఆమె ముఖం నిండా సంతోషం. "మన సుబ్బు అయ్యేఎస్‌కి సెలెక్ట్ అవుతాడని నాకెప్పుడో తెలుసు."

"అరె ! నీకు జ్యోతిష్యం తెలుసునని నాకింతవరకు తెలియదే!" వేళాకోళంగా అన్నాడు కేశవులు.

"కలెక్టరు కావాలని వాడి చిరకాల స్వప్నం! వాడు ఊరికే కలలు కంటూ కూర్చొలేదు. బుర్ర చెడిపోయేటట్టు రేయింబవళ్ళు చదివాడు. వాడికి కలెక్టరు ఉద్యోగం రాకపోతే ఇంకెవరికి వస్తుంది. శ్రమయేవ జయతే అని ఊరికే అనలేదు పెద్దలు."

"నేను మాత్రం మన సుబ్బు ఇంతవాడవుతాడనుకోలేదు."

"ఇక సుబ్బు, గబ్బు అనకండి! కాబోయే కలెక్టరును అలాగేనా పిలిచేది? సుభాష్ అయ్యేఎస్ అండీ మన బాబు!" గర్వాతిశయంతో ఆవిడ గొంతు పూడుకుపోయినట్టుగా అయింది.

"ఎక్కడ ఈ బక్కరైతు చెన్నకేశవయ్య? ఎక్కడ సుభాష్ ఐ.ఎ.ఎస్.?" ఆనందంతో అతడికళ్ళింకా చెమర్చుతూనే ఉన్నాయి. "పై చదువులు చదువుతాను నాన్నా అని వాడు పట్నం వెడితే ఓ నెల పంపేవాడిని.. ఓనెల కుదిరేది కాదు. అయినా ఒక్కనాడూ డబ్బుకు ఇబ్బంది పెట్టలేదు. తినేవాడో తినక చదివేవాడో! పేరున్న కాలేజీలో చదివించింది లేదు. అయినా సుబ్బుకు చిన్నప్పటి నుంచి చదువు మీద ఉన్న ఇష్టమే అతడినింతవాడిని చేసింది! ఇవాళ ఈ కేశవుడికి కలెక్టరు తండ్రి హోదా కల్పించాడంటే నేను చచ్చి వాడి కడుపున పుట్టి నా కృతజ్ఞత వెల్లడించుకోవాలని ఉంది!" అన్నాడు కేశవులు.

"ఛా! అవేం మాటలండీ?"

"లాయరు కొడుకు లాయరు, డాక్టరు కొడుకు డాక్టరూ కావచ్చునే, కానీ ఈ పల్లెటూళ్లో అతి సామాన్యంగా గడిపే బక్క రైతు కొడుకు కలెక్టరు కావడం సామాన్యం కాదే? ఒక్కనాడూ మంచి బట్ట కొనివ్వలేదు. ఒక్కనాడూ మంచి తిండి పెట్టలేదు. వాడికింకా మంచి మార్కులు

# నెమలీక



**బలభద్రపాత్రుని రమణి**

“నా నెమలీక నాకిచ్చెయ్యి” అన్నాడు పార్థు.

విభకి ఒళ్ళు మండిపోయింది. “అయితే ఇంటర్వెల్‌లో నేను తెచ్చిన మాగాయి ముక్కలు తిన్నావుగా? వెనక్కివ్వగలవా?” అంది.

“నా పేరు లెక్కల మాస్టారుకి ఎందుకు చెప్పావు?” కోపంగా అడిగాడు.

“నువ్వే ఆయన కుర్చీ కింద దీపావళి మందు బిళ్ళలు పెట్టావు? కూర్చోగానే ‘ఢాం’ అనేట్టూ... పాపం ఆయనకి ఎంత భయం వేసిందో చూశావా? గుండె పట్టుకున్నారు”. అంది జాలిగా విభ.

ఆ దృశ్యం తలుచుకోగానే జాలి కలగడానికి బదులుగా చాలా నవ్వొచ్చింది. పెద్దగా నవ్వుతూనే ఉన్నాడు.

“మాస్టారు బెత్తంతో బడితెపూజ చేసినా నీకు సిగ్గు రాలేదా? నవ్వుతున్నావు?... అంది విభ

“నీ పిలక జడలు వెనక నుండి కత్తిరించకపోతే నా పేరు పార్థాయే కాదు” కోపంగా చూస్తూ ప్రతిజ్ఞ చేశాడు.

విభ తన స్నేహితురాళ్ళు జానకీ, రుక్మిణీ, సుచరితలతో మీటింగ్ పెట్టింది. “వాడు అన్నంత పనీ చేస్తాడేమో..... ఎప్పుడూ క్లాస్‌లో ఓ కన్నేసి

ఉంచండే" అంది.

వాళ్ళు 'సరే' అన్నారు.

పార్థూ వారం రోజులు విభ వైపు కన్నెత్తి చూడలేదు. సుహాసినిని పిలిచి "ఇదిగో ఆరుద్ర పురుగు"... "అగ్గిపెట్టెలో గడ్డి వేసి తెచ్చాను. వీటికి మైదా ఉండలు వెయ్యి పిల్లల్ని పెడ్తాయి... ఆ విభ పిచ్చిది. నెమలీక పిల్లల్ని పెడ్తుంది అంటుంది. నమ్మకండి... ఈ రెండు పురుగులూ చూడు ఎన్ని పిల్లల్ని పెడ్తాయో..!" అని అగ్గిపెట్టె ఇచ్చాడు.

సుహాసిని అగ్గిపెట్టె ఇంటర్వెల్‌లోనే ప్రదర్శనకి పెట్టింది. విభ పక్కనుండే జానకీ, రుక్మిణీ కూడా "ఓ సారి మా చేతిలో వెయ్యవే... అంటూ సుహాసిని దగ్గరకి వెళ్ళిపోయారు విభని వదిలి.

విభకి చాలా ఉక్రోషం వచ్చింది. మేత్స్ నోట్‌బుక్‌లోంచి నెమలీక తీసి చిన్న చిన్నగా కత్తిరించి "చూడండే... నా నెమలీక పిల్లల్ని పెట్టిందే..." అంటూ అరిచింది. అందరూ సుహాసినిని వదిలి విభావరి చుట్టూ చేరారు.

పార్థూ వచ్చి చూసి "పిల్లలు కాదు... నెమలీకని బ్లేడ్‌తో కత్తిరించింది ఇది" అని పెద్దగా నవ్వాడు. అంతా 'అవునా?' అని నవ్వారు.

విభ కోపంగా చూసి, ఉక్రోషం పట్టలేక ఏడుస్తూ ఇంటికి పరిగెత్తింది.

ఆరోజు ఇంట్లో పిన్నికి పెళ్ళిచూపులుట. సాయంత్రం విభ తల్లి మైసూర్‌పాకం, అరిటికాయ బజ్జీలు చేసింది. పిన్ని ముఖం ఎర్రబడేట్లు ఏడుస్తోంది. "నేను చదువుకోవాలి... పెళ్ళి వద్దు.."అని.

"ఓసారి పెళ్ళి చూపులకి కూర్చో... వెంటనే కుదిరిపోతుందా? అబ్బాయి డాక్టరట. ...ఒప్పేసుకుంటే అదృష్టమే.. లేదా ఇప్పటి నుండీ మొదలు పెడ్తే పై ఏటికి కుదుర్తుంది" అంది అమ్మమ్మ.

"ఒద్దంటే నీక్కాదూ...?" పిన్ని అరిచింది.

"మరీ అంత ఇష్టం లేనప్పుడు ఎందుకు లేవే? అమ్మ నసిగింది అమ్మమ్మతో. అమ్మమ్మ తలకొట్టుకుని "నువ్వు మాత్రం రామాన్ని చూడగానే ఒప్పుకున్నావా? ఇప్పుడు చూడు పళ్ళలాంటి పిల్లలూ, బంగారం లాంటి కాపురం.. దానికీ పెళ్ళయి ఓ పిల్ల పుట్టగానే అంతా కుదురుకుంటుంది. అబ్బాయి డాక్టర్. ఇల్లూ, వాకిలీ ఉన్నవాడు" అంది అమ్మమ్మ.

# డాక్టరుగారింటి గృహప్రవేశం



**పోలాప్రగడ రాజ్యలక్ష్మి**

డా॥ శ్యామల, డా॥ సుబ్బారావు ఇద్దరూ డాక్టర్లేను. ఇద్దరికీ ఆ ఊర్లో మంచి డాక్టర్లుగా పేరు ఉంది. ఆ పేరుతోనే బోల్డంత డబ్బు సంపాదించారు. సరదాగా ఇద్దరమ్మాయిల్ని కన్నారు. ఆ ఇద్దరూ చూడముచ్చటగా ఉన్నారు. ముద్దులు మూట కడుతున్నారు. ప్రియ, జయ అని పేర్లు పెట్టారు. ఇన్‌కం టాక్స్ వాళ్ళకు దొరకకుండా, కొంత డబ్బు దాచేశారు. ఎలా దాచారంటే ఇంట్లో మధ్య గదిలో ఒక పెట్టెలో నోట్ల కట్టను పెట్టి పైన అందమైన రాధాకృష్ణుల విగ్రహాలు పెట్టి, ఎవరికీ అనుమానం రాకుండా పకడ్బందీగా దాచేశారు. ఆ విగ్రహానికి పూజలు చేస్తారు, హారతులు ఇస్తారు. ఆనందిస్తారు. ఏమిటో? ఎంత డబ్బు సంపాదించినా ఖర్చు పెట్టకుండా దాచేస్తే ఏం సరదా ఉంటుందని బాధపడుతున్నారు ఈ మధ్యన శ్యామల, సుబ్బారావు.

ఎవరికీ ఇంత డబ్బులున్నాయని చెప్పుకోకూడదంది, చెప్పుకోకపోతే సరదాగా లేదు. ఒక రోజున శ్యామల భర్త సుబ్బారావుతో అంది, ఇలా డబ్బు దాచుకోవడం కంటే మంచి అందమైన బిల్డింగ్ కట్టుకుందాం అని దర్జాగా అంది. సుబ్బారావు విని ఇంత ప్రాక్టీస్ ఉండగా ఇల్లు కట్టుకోవడం కష్టం అన్నాడు. ఆ ఇల్లు కట్టడానికి కాంట్రాక్ట్ ఇచ్చేద్దాం అంది. స్విమ్మింగ్ ఫూల్, పక్కన పూల మొక్కలు, సినిమా సెట్టింగ్‌లా ఉంటే ఎంత

బాగుంటుంది అంది. అంతా విని సుబ్బారావు పక పకా నవ్వి ఇప్పుడు ఇంత డబ్బు ఖర్చు పెడ్తే ఇంత డబ్బు ఎక్కడినుంచి వచ్చిందని చుట్టాలు, స్నేహితులు ఈర్ష్య పడతారు అన్నాడు. ఈ ఇంటి గొడవలో పడి మన ప్రాక్టీసు దెబ్బతింటుందేమో నా మాట విను అని డా॥ సుబ్బారావు శ్యామలతో అన్నాడు.

శ్యామల అలిగి, మూతి అటూ, ఇటు తిప్పి గారాలు పోయింది. అది చూసిన సుబ్బారావుకు శ్యామల ముద్దొచ్చి తర్వాత ప్రేమొచ్చి, సరేలే అలగకు అని ఒప్పేసుకున్నాడు. ఒప్పేసుకున్నాడు గానీ లోపల కోపంగానే ఉంది సుబ్బారావుకి. దాంతో కొంచెం సీరియస్‌గా ముఖం పెట్టి శ్యామలతో మాట్లాడటం మానేశాడు. తనతో బలవంతంగా ఇల్లు కట్టడానికి ఒప్పించిందని. అయినా ఈ చిన్న ఇంట్లో ఉండటం కంటే, పెద్ద ఇల్లు ఉంటే బాగుంటుందని తనకి అనిపిస్తుంది. వాళ్ళ అమ్మానాన్న వస్తారు. మా అమ్మానాన్న వస్తారు అనే ఇల్లు కట్టించడానికి నిర్ణయించుకున్నాడు. మెల్లిగా, స్నేహితుల సలహా సహకారాలతో బిల్డింగ్ కట్టించడం మొదల పెట్టించాడు సుబ్బారావు. కొంత డబ్బు స్నేహితులూ, కొంత డబ్బు బంధువులూ అప్పు ఇచ్చినట్లు డాక్యుమెంట్రీలు సృష్టించి, తన తెలివితేటలు అన్నీ ఉపయోగించి మరీ కట్టాడు ఆ ఇల్లు.

శ్యామలకి అంత అందమైన ఇల్లు కట్టించి ఇచ్చినందుకు ఆనందపడిపోయి భర్త సుబ్బారావంటే ముద్దొచ్చేసి, సుబ్బు శ్రీవారు మావారు అంటూ పొగిడేసింది. ఇంతలోనే పెద్ద బెంగొచ్చింది శ్యామలకి మనసులో. డబ్బంతా ఇలా ఖర్చు పెట్టేస్తున్నాం, అని బిక్కమొహం పెడుతూ సుబ్బారావుతో అంది. డబ్బులైపోతున్నాయని. బెంగపడకు, మందులతో పండించిన పంట తింటున్నారు ప్రజలు. పేషెంట్లుగా మన దగ్గరికే వస్తారు. అని ధైర్యం చెప్పాడు చలోక్తిగా సుబ్బారావు. సరే అయితే ఇంటి గృహప్రవేశానికి డబ్బులున్నాయా అంది, పెద్ద ఇల్లు కట్టుకున్నప్పుడు డాబుగా ఫంక్షన్ చెయ్యాలి. అందరికీ బట్టలు పెడితేనే ఆనందిస్తారు. డబ్బుల సంగతి నేను చూసుకుంటాలే అన్నాడు. అయితే బ్రాహ్మణుడిని పిలిపించి ముహూర్తం పెట్టిస్తాను అన్నాడు.

నా చిన్నప్పుడు నాతో చదువుకున్న శాస్త్రిని పిలుస్తాను అన్నాడు. ఆ శాస్త్రికేం రాదు ఎవరైనా పండితుణ్ణి పిలవండి అంది శ్యామల. నా

# మళ్ళీ వచ్చిన పూర్వపుకళ



**తమిరిశ జానకి**

సదాశివరావుగారు పోయినప్పటినించీ ఆ ఇంట్లో మెల్లిమెల్లిగా మార్పులు చోటుచేసుకోడం మొదలయ్యింది. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. అది నిజమే. కానీ ఇంటి యజమాని చనిపోతే అంతవరకూ ఆ ఇంట్లో అనుసరిస్తున్న మంచి పద్ధతులుఅటకెక్కిపోవలసిందేనా అనుసరించడానికి తగిన వసతులు లేకపోతే అది వేరే విషయం. కానీఏలోటూ లేనప్పుడు సజావుగా సాగిపోతున్నప్పుడు ఎందుకా మార్పు అదే అర్ధంకావట్లేదు సరోజినికి.

పదిహేనేళ్ళ వయసప్పుడు సదాశివరావుతో పెళ్ళయి పల్లెటూరూకాని పట్నమూ కాని ఆ ఊళ్ళో ఆ ఇంట్లో అడుగుపెట్టింది. ఆ రోజునించీ ఆ ఇంటి పద్ధతులుఇంట్లోని వారి అలవాట్లు ఆవిడకి ఇట్టే ఆకళింపుకొచ్చాయి. చక్కగా ఇమిడిపోయింది ఆ ఇంట్లో. వేలెత్తి చూపడానికి ఎవరిలోనూ ఏ లోపమూ లేదు. ఇంట్లో అందరూ తనకంటే పెద్దవాళ్లు.... తన మీద వాళ్ళు పెత్తనం చేస్తున్నారని గానీ వాళ్లు చెప్పినట్టు తనెందుకు వినాలని గానీ అనుకోలేదెప్పుడూ సరోజిని. వాళ్ళు తనమంచికేకదా చెప్తున్నారని ఆలోచించేది ఆ చిన్నవయసులోకూడా. ఆస్తిపాస్తులకు లోటు లేదు. అత్తా మామ భర్తా మంచివాళ్ళు. తన తండ్రి అడుగుజాడల్లోనడిచే సదాశివరావు ఒక్కడే సంతానం. తోబుట్టువులు లేరు. ఇంట్లో ఎప్పుడూ వంట మనిషి ఇద్దరు పనివాళ్ళు తమ కుటుంబంలో

సభ్యుల్లాగే ఉండేవారు. హరికథలు బుర్రకథలు చెప్పేవాళ్ళు కూచిపూడి భాగవతులు నలభయ్యేసి రోజులు రామాయణ భారత భాగవతాలు దేవాలయాల్లో వినిపించడానికి కార్యక్రమాలు చెయ్యడానికి వచ్చినవారు ఇలా ఎప్పుడెవరు ఊళ్ళోకి వచ్చినా సదాశివరావుగారింట్లోనే ఆశ్రయం పొందేవారు. ఆ పెద్ద లోగిలిలో ఎవరికీ చోటు లేకపోవడమంటూ ఉండదు. వెనకవైపు ఆవరణలో కూడా కొన్ని గదులు ఉన్నాయి. కొందరు కావలసిన సరుకులు అడిగి తీసుకుని ఆ గదుల్లో వాళ్ళు వొండుకునేవారు. అదికాక వారాలుచేసుకుని చదివే విద్యార్థులు ఏడాదికి మూడువందల అరవైఅయిదు రోజులూ ఉండేవారు. చదువు మీద శ్రద్ధ.... చదువుకోవాలన్న ఆశ ఉన్న పిల్లలకి ధనసహాయం చేస్తూ వాళ్ళు పెద్ద చదువులు పూర్తి చేసేవరకూ నేనున్నానంటూ ఆదుకునే సదాశివరావుగారంటే ఆ చుట్టుపక్కల ఊళ్ళల్లో తెలియనివారు లేరు. ఇంటికొచ్చిన వారికి అన్నంతోపాటూ ఆప్యాయత అందరికీ అందించేవారు ఇంట్లోవాళ్ళు. అలా ఉండడమే సరోజినికీ అలవాటయింది.

అత్తగారు పోయాక ఆవిడ లేరుకదా అని ఏ విషయంలోనూ ఏమరుపాటుగా ప్రవర్తించేది కాదు సరోజిని.అన్నిపద్ధతులూ యధావిధిగా జరిగేలా చూడటంలో శ్రద్ధ తీసుకునేది. దేవతవి తల్లీ నువ్వు అని ఎవరు పొగిడినా తల అడ్డంగా ఊపేది. ఆ భగవంతుడిచ్చాడు కాబట్టి మీకు పెట్టగలుగుతున్నాము. మా గొప్ప ఏమీ లేదు అనేది. ఉన్నా పెట్టే మనసు అందరికీ ఉంటుందా తల్లీ అంటారు వాళ్ళు. దానికి సమాధానం తన దగ్గరలేదన్నట్టుగా మౌనంగా ఉండిపోయేది సరోజిని.ఇద్దరు కొడుకులూ ఆణిముత్యాలనే అనుకుంది. లేకలేక ఆలస్యంగా కలిగిన సంతానం. వాళ్ళమీదే తన ప్రాణమంతా. కాలేజి చదువులకి వచ్చాక పిల్లలిద్దరినీ మద్రాసులో పెద్ద కాలేజిలో చేర్పించి మురిసిపోయాడు సదాశివరావు. ఇద్దరికీ ఒక్క సంవత్సరమే తేడా.ఆయనైతే ఆనందపడిపోయాడు గానీ సరోజిని బెంగ పడిపోయింది. ఔనుమరి... అక్కడ హాస్టల్లో ఉండి చదువుకోవాలి. ఇంటిమీద బెంగతోనూ ఆ తిండి సయించకపోతేనూ పిల్లలపరిస్థితి ఏమిటన్న దిగులుతో ఇక్కడ ఈవిడకి తిండి సయించేది కాదు. ఇంట్లో మప్పితంగా వాళ్ళకేం కావాలంటే అవి నిమిషాల్లో చేయించి పెట్టడమేకాక వెంటపడి వెంటపడి బతిమాలి బామాలి తినిపిస్తుంది. అక్కడంత రాజసంగా జరగదుకదా. ఏవిటో ఈ చదువులు ఉన్నఊరికి అంత దూరంగా ఆ పెద్ద పట్నంలో చదివిస్తేగానీ చదువులుకావా

# ఏదీ నీ హృదయం?



కె. ఉషారాణి

ఆకాశంలో పిట్టలాగా ఎగిరే విమానం. ఎత్తుగా ఎగరడంతో చుక్కలాగా కనబడుతూ ఉంది. బాల్కనీలో నిలబడి దాన్ని తదేకంగా చూస్తోంది విలీన. "రేపు ఇదే ఫ్లైట్లో కిరణ్ వస్తాడు" అనుకుంటుంటే ఆ అమ్మాయి కళ్ళల్లో ఒక సన్నని కాంతి. పెదవి మీద లేత వెన్నెల ఛాయలా కనపడే చిరునవ్వు, సరిగ్గా పదేళ్ళు, వీడియోకాల్స్‌లో చూస్తూనే ఉన్నా, రోజూ మాట్లాడుతూనే ఉన్నా, దూరం దూరమే! సముద్రాల కవతల కిరణ్, ఇవతల విలీన. ఒక దశాబ్దం తర్వాత కలుసుకుంటున్నారు ఇద్దరూ. విలీన చెంపల్లో చేరిన వెచ్చదనం. విడిపోయే ముందు వాళ్ళు కేవలం స్నేహితులు, కానీ ఇప్పుడు కలిస్తే, కాబోయే భార్యా భర్తలు. విలీన బాల్కనీలో పూసిన ముద్ద గులాబీని చిన్నగా స్పృశించింది. "నీకు తెలుసా?! కిరణ్‌కి నేనంటే ప్రాణం" వంగి పువ్వుకి గుసగుసగా చెప్పింది. "తను తన ఇష్టం చెప్పేశాడు. నేనే, రేపు రాగానే నా మనసు విప్పాలి. ఐ లవ్ యూ అని చెప్పాలట. ఆర్డరేశాడు". విలీన గులాబీతో గుసగుస లాడుతుండగా తండ్రి "విలీనా!" అని పిలుస్తూ వచ్చాడు "ఇక్కడేం చేస్తున్నావమ్మా?" అంటూ. "ఏం లేదు నాన్నా!" తండ్రి ప్రశ్నకు బదులిస్తూ, "చల్లగాలికి మీరెందుకొచ్చారు, పదండి!" ఆయన్ని మళ్ళీ లోపలికి నడిపించింది. "డాక్టర్ అంకుల్ మిమ్మల్ని స్ట్రెయిన్ కాకూడదు అని చెప్పలేదూ?" మేడ మెట్ల వైపు అసమ్మతిగా చూసింది. "మీరిన్ని మెట్లు

ఎక్కి రావడం నాకు నచ్చలేదు నాన్నా! కిట్టూని రానివ్వండి. మంచానికి కట్టెయ్యమని చెప్తాను". కూతుర్ని ప్రసన్నంగా చూస్తూ నవ్వాడాయన. "కిట్టూ!? ఇంకా కిట్టేనా? తనిప్పుడు కిరణ్ ప్రభు యం.ఎస్. నువ్వు కిట్టు అంటే ఒప్పుకోవద్దూ??" కిట్టూని అలా అనడం నచ్చనట్టు తండ్రిని చురచురా చూసింది. "కిట్టు ఎవరు ఒప్పుకోవడానికీ? ఒప్పుకోకపోవడానికీ? తన మీద మనకున్న హక్కులు మామూలువా, ఏం??" తండ్రిని సోఫాలో కూర్చోబెట్టి జ్యూస్ గ్లాస్‌లో పోసి అందించింది. "కిట్టుని మనం మళ్లీ వెనక్కి పోనివ్వద్దు నాన్నా! హాస్పిటల్ అప్పగించేద్దాం" ఆయన విలీన అన్నదానికి నవ్వుతూ తలూపాడు. విలీనలో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. కిరణ్ రాగానే చెయ్యవలసిన పనులేమిటో తండ్రికి ఏకరువు పెడుతోంది. "మేడ మీది గదిలో తను ఉండనీ నాన్నా! మనిద్దరం కిందుందాం. వెళ్ళి గది సర్దించి వస్తాను". విలీన వెళ్లిపోతోంది. ఆయన చూస్తూ ఉన్నాడు. విలీన మేడ పూర్తిగా ఎక్కాక జేబులో ఉత్తరం తడిమి బయటకు తీశాడు. దాని మీద తన పేరు రాసి ఉంది 'దాశరథి' అని. కవర్ చింపే ఉంది. అతను లోపలున్న ఉత్తరం బయటకు తీశాడు. ఐదారు వాక్యాలు మించి లేవు.

అంకుల్!

విలీనకు నాగురించి చెప్పారా? తనకి మా బంధం మీద చాలా ఆశలున్నాయి. నాకంత ధైర్యం లేదు. అందుకే నేను ఏ రకంగానూ కోరికలు పెంచుకోలేదు. కానీ విలీన ఊరుకోదు. అందుకే వచ్చేలోగా ఆమెకు నిజం చెప్పండి. అంతా తెలిశాక కూడా తను మా పెళ్లికి ఒప్పుకుంటే నాకు అంతకు మించిన అదృష్టం లేదు. దయచేసి ఇక దాచకండి. ప్లీజ్! మీ కిరణ్ (కిట్టు). దాశరథి ఆ ఉత్తరం మడిచి మళ్ళీ లాల్చీ జేబులో పెట్టుకుని నిట్టూరుస్తూ వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు.

----

మెత్తటి వేగంతో కారు ఎయిర్ పోర్ట్ వైపు పరిగెడుతోంది. "కిట్టు వచ్చేస్తుంటాడు కదా నాన్నా!?" విలీన ఉత్సాహంగా అడిగింది. దాశరథి తలూపాడు. "ప్చ్" చప్పరించింది కొరతగా. "మనం లేటై పోయాం, వెధవ ర్యాలీ! మనకే అడ్డం రావాలా??" విసుక్కుంది. దాశరథి విలీననే చూస్తున్నాడు. బిడ్డ సంబరం ఆయనకి చూడ్డానికి చాలా బావుంది. కానీ

# చెట్టు కూలింది



## నెల్లుట్ల రమాదేవి

సాయంత్రం అయిదు గంటలయింది. వాకిట్లో వేపచెట్టు కింద వాలుకుర్చీలో కూర్చుని ఉన్నాడు నారాయణ. ప్రొద్దుటి దినపత్రికను పట్టుకుని అటుతిప్పీ ఇటు తిప్పీ చదువుతున్నాడే కానీ, మనస్సు దాని మీద లగ్నం కావడం లేదు.

మధ్యాహ్నం భోజనాల దగ్గర కొడుకులు, కోడళ్ల సంభాషణ గుర్తుకు వచ్చింది. ఎన్నాళ్ళనుంచో నలుగుతున్న విషయమే - మళ్లీ చర్చకు వచ్చింది.

"ఆ విషయం గురించి ఏమాలోచించావు నాన్నా"? పెద్దకొడుకు చంద్రశేఖర్ అడిగాడు.

అన్నం ముద్ద నోట్లో పెట్టుకోబోతున్న వాడల్లా ఆగి "ఏ విషయం?" అన్నాడు నారాయణ తెలిసినా తెలియదన్నట్టుగా.

"అదే!...ఇల్లు గురించి...." నసుగుతూ తమ్ముడి వేపు చూశాడు సపోర్టుకోసమన్నట్లుగా.

"మాకు రేపటితో సెలవులు అయిపోతున్నాయి. రెండ్రోజులు సెలవు పొడిగించుకుని ఉంటాం. రాతకోతలు పూర్తిచేసుకోవచ్చు". 'కాదనేరు సుమా' అన్నట్లుగా చెప్పాడు. రెండో కొడుకు రాజశేఖర్.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/65+Mandi+Telugu+Rachayitala+Kotta+Kathalu**

* * *